క్లుప్తంగా

భీమేశ్వరునికి విశేష పూజలు


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామిని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సోమవారం దర్శించుకున్నారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆయనకు పండితులు వేదాశీర్వచనం చేశారు. సోమవారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

పెద్దాపురం అసెంబ్లీ పోరులో పదిమంది..

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికలకు నియోజకవర్గంలో పోటీలో పదిమంది ఉన్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె. సీతారామారావు సోమవారం తెలిపారు. పరిశీలనలో 10 మంది నామినేషన్లను ఆమోదించినట్టు ఆయన తెలిపారు. వారిలో దవులూరి దొరబాబు (వైఎస్సార్ సీపీ), నిమ్మకాయల చిన రాజప్ప (టీడీపీ), తుమ్మల దొరబాబు (కాంగ్రెస్), పెయ్యల అరుణ్‌కుమార్ (బీఎస్పీ), బుంగా సత్యనారాయణ (జై భీమ్ రావు భారత్ పార్టీ), కేశవరపు రామ్మోహనరావు (ఇండియా ప్రజా బంధు పార్టీ), మోటుపల్లి శివకుమార్ (స్వతంత్ర), దువ్వాడ కన్నయ్య (స్వతంత్ర), లావణ్య (స్వతంత్ర), రాయుడు మోజెస్ బాబు (స్వతంత్ర) అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో రూ.4 లక్షల స్వాధీనం


ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్న నగదు

సామర్లకోట: ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో సోమవారం రూ.నాలుగు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రథం షెడ్ వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న పి.వెంకట సూర్యనారాయణ అనే వ్యక్తిని ఆపి ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. ఈ మొత్తం బ్యాంకులో డిపాజిట్టు చేయడానికి తీసుకు వెళుతున్నట్లు బాధితుడు సూర్యనారాయణ తెలిపారు. అయితే ఎటువంటి రసీదులు లేకుండా అనుమతికి మించి నగదు కలిగి ఉండటంతో అధికారి ఎ.ప్రదీప్‌కుమార్ ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై మౌనిక పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న నగదును పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపించారు. ఈఆర్వో జె.సీతారామారావు సీజ్ చేసిన మొత్తాన్ని కాకినాడ ట్రెజరీకి చేశారన్నారు.

ప్రమాదకరంగా ఉన్న చెట్టు తొలగింపు


కొబ్బరి చెట్టును తొలగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో పెట్రోలు బంకు సమీపంలో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఓ కొబ్బరి చెట్టును ఉన్నతాధికారుల అనుమతితో ట్రాఫిక్ ఏఎస్సై రత్నం సోమవారం తొలగించారు. ట్రాఫిక్ సిబ్బంది వాహన రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఓటర్లలో చైతన్యం కోసమే స్వీప్


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ ఉషారాణి తదితరులు

పెద్దాపురం: ఓటర్లలో చైతన్యం కోసమే స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో మాదిరెడ్డి ఉషారాణి తెలిపారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా కట్టమూరులో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఉషారాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీలో ఒకడిగా గెలిపించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి
- మర్లావలో ఇంటింటా విస్తృత ప్రచారం


ఎన్నికల ప్రచారంలో చురుగ్గా సాగిపోతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో స్థానికుడినైన తనను గెలిపించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా సోమవారం మండలంలోని మర్లావలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మిరియాల రాజా, కామన రామకృష్ణ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాన్ని ఉద్దేశించి దొరబాబు మాట్లాడుతూ మీలో ఒక్కడిని.. స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడినైన తనకు జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారు. ప్రతి ఒక్కరూ తనను ఆదరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని దొరబాబు కోరారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. తనతో పాటు కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని దొరబాబు కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కనపర్తి చీమదొర, గోలి రామారావు, పెంటా విజయ్ కుమార్, సుందరెడ్డి రాజు, కనపర్తి శ్రీనివాస్, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల నానాజీ, కుంచే వెంకన్న అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

స్థానిక అభ్యర్థిని ఆశీర్వదించండి

సామర్లకోట: స్థానికుడైన తన భర్త దవులూరి దొరబాబును ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి వైఎస్సార్ సీపీ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలని దవులూరి చంద్రకళ అన్నారు. సోమవారం మండల పరిధిలో పనసపాడు గ్రామంలో రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ములసా శ్రీను, బదిరెడ్డి బుజ్జి, శ్రీను, పెద్దాపురం కౌన్సిలర్లు పాలిక కుసుమ, రెడ్డి లోవకుమారిలతో కలిసి ఇంటింట ఎన్నికల ప్రచారం చేశారు. స్థానిక ఎమ్మెల్యేతోనే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఒక్కసారి దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాట వేయాలని పిలుపు నిచ్చారు. ఎంపీ అభ్యర్థిగా సునీల్‌కు ఒక ఓటు, ఎమ్మెల్యే అభ్యర్థిగా దొరబాబుకు ఒక ఓటు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో ఆయనను ఓడించే ధైర్యం లేక పోవడంతో మూడు పార్టీలతో పొత్తు పెట్టుకొని చంద్రబాబునాయుడు పోటీ చేస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డికి చేసిన మేలును 14 ఏళ్ల పాటు మూడు పర్యాయాలు సీఎంగా చేసిన చంద్రబాబునాయుడు పాలనను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఏమి చేస్తామో చెప్పాల్సిన ప్రతిపక్షాల నాయకులు ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం దారుణమన్నారు. చిరు వ్యాపారులకు పావలా వడ్డీపై రుణాలు ఇస్తూ ప్రభుత్వం ఆదుకుంటోందని, టైలర్లకు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం చేస్తోందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా టైలరింగ్ చేస్తున్నవారి వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు.


పి.వేమవరంలో స్థానిక నాయకులతో కలసి ప్రచారం చేస్తున్న దవులూరి చంద్రకళ


పనసపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన దవులూరి చంద్రకళ తదితరులు

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సానియా, గృహసారథుల పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ గుత్తుల కృష్ణార్జున రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అలాగే మండల పరిధిలోని పి.వేమవరంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, పార్టీ నాయకులు ఎలిశెట్టి నరేష్ తదితరులు దవులూరి సతీమణి చంద్రకళతో ప్రచారంలో పాల్గొన్నారు. వారి వెంట సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం, ఎంపీటీసీ కేశవరపు వీరమణి, ఉపసర్పంచ్ అత్తిలి సుబ్బలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొర పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న వంగా గీత

- పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేతలతో సమావేశం

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో తాను నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పూర్తి స్థాయిలో ప్రచారం చేయడం సాధ్యం కాదన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారు తమ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాల్లో ఉండాలని సూచించారు. ఓటర్లను చైతన్యవంతులను చేసి వైఎస్సార్ సీపీకి ఓటు వేసేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తే అండగా ఉంటామన్న భరోసా నాయకులు ప్రజలకు కల్పించాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లి ఓటు వేయమని అడిగే దమ్ము, ధైర్యం ఒక్క వైఎస్సార్ సీపీ నేతలకే ఉందన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ పార్టీ జెండాను ఏళ్ల పాటు మోసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చిన సత్తా ఒక్క వైఎస్సార్ సీపీ నేతలకు, కార్యకర్తలకు మాత్రమే ఉందని అదే స్ఫూర్తితో ఇప్పుడు పనిచేయాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ఒక్క ఓటు కూడా పోకుండా వేయించే బాధ్యత నాయకులు తీసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం


పిఠాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత

- ఎటు చూసినా ఊరేగింపుల కోలాహలం
- దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు

పిఠాపురం: మండే ఎండే కాదు ఎన్నికల ప్రచారం సైతం వాతావరణాన్ని వేడెక్కిస్తుంది. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా రెండు వారాలే గడువున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో ప్రచారం ఊపందుకుంది. ఓటరు లిస్టుల ఆధారంగా ఎవరి ఓట్లు వచ్చే అవకాశముంది, ఎవరు ఓట్లు వేయరనే విషయంపై స్థానిక నాయకులు సుదీర్ఘ మంతనాలు జరుపుతున్నారు. అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించడంతో ఆయా గుర్తులు గల పోస్టర్లతో విస్తృత ప్రచారం ప్రారంభించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఊరేగింపులు, బాణసంచా కాల్పులతో కోలాహలం నెలకొంది. ఇప్పటికే పూర్తి స్థాయిలో రంగంలోకి దిగిన అభ్యర్థులు సోమవారం నుంచి ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వంగా గీత, కాకినాడ పార్లమెంటు అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌లు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధి కారణంగా వైఎస్సార్ సీపీకి ఊరూరా ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుంది. ప్రభుత్వంపై ఉన్న అభిమానంతో మహిళలు ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. మరోవైపు అధికారులు ఎన్నికల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు గ్రామాల్లో నేర చరిత్ర ఉన్నవారిపై దృష్టి సారించి పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల ప్రచారాలపై దృష్టి సారించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే తాట తీస్తాం

- జనసేన ట్రోల్స్‌పై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

పిఠాపురం: వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పార్టీ మారుతున్నట్లు జనసేన సోషల్ మీడియాలో చేస్తున్న ట్రోల్స్‌పై పిఠాపురం వైఎస్సార్ సీపీ నేతలు మండిపడ్డారు. పిఠాపురంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడిన వైఎస్సార్ సీపీ నేతలు వంగా గీతపై సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. లక్ష మెజార్టీతో గెలుస్తున్నామని చెప్పుకుంటున్న జనసేన నేతలు ఇలా దిగజారుడు పనులకు పూనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజల మద్దతు వంగా గీతకు ఉందని అర్థమై తాము ఓటమి పాలవ్వక తప్పదని తెలిసి జనసేన సోషల్ మీడియాలో లేనిపోని అభూత కల్పనలతో ప్రచారాలకు దిగిందన్నారు. అందరి మన్ననలు పొందుతున్న వంగా గీత విజయాన్ని ఆపే శక్తి ఏ ఒక్కరికీ లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు బుర్రా అనుబాబు, గండేపల్లి బాబి, కొత్తపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అమలుకు సాధ్యమయ్యే హామీలతో మేనిఫెస్టో

గొల్లప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుకు సాధ్యమయ్యే హామీలతోనే ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించారని జెడ్పీటీసీ సభ్యుడు వులవకాయల నాగలోవరాజు అన్నారు. సోమవారం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అరెగిల రామయ్యదొరతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక భద్రత పింఛన్ల పెంపు, అమ్మఒడి రూ.17 వేలకు, జగనన్న తోడు రూ.20 వేలకు, రైతు భరోసా రూ.16 వేలకు, డ్వాక్రా రుణాలు రూ. 3 లక్షల వరకూ పెంపు వంటి పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళతామని సీఎం జగన్ ప్రకటించారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి వివరించి ఓట్లు అభ్యర్థిస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నేమాని ఆదివిష్ణు, తాడిపర్తి ఉప సర్పంచ్ దాసం వెంకటేష్, కడిమిశెట్టి భాస్కర్ రెడ్డి, లోకారెడ్డి అప్పన్నదొర, ఓరుగంటి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ వెంకట నారాయణ

కొత్తపల్లి: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకట నారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తాగునీటి పంపిణీపై పలువురు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన పైపులైన్లు, తాగునీటి పథకంలో మోటార్లు దెబ్బతిన్నా త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంధ్య, విద్యుత్ శాఖ ఏఈ ప్రమోద్, ఈఓపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేటలో పాటు

- వేటకు విరామం.. మత్స్యకారుల ప్రచారం
- రోజుకూలీ ఇచ్చి తీసుకెళుతున్న నేతలు
- కళకళలాడుతున్న మత్స్యకార గ్రామాలు


వేట లేక బోసిపోయిన ఉప్పాడ తీరం

పిఠాపురం: నిత్యం చేపల క్రయవిక్రయాలతో కళకళలాడే సముద్రతీరం ఏప్రిల్ నెల వచ్చిందంటే బోసిపోతుంది. వందల సంఖ్యలో వేటకు వెళ్లాల్సిన బోట్లు ఒడ్డుకే పరిమితమవుతాయి. వేలాది మంది మత్స్యకారులు వేట విరామంతో ఇళ్లకే పరిమితమై వేరే పని లేక తమ వలలు, బోట్లు మరమ్మతులు చేసుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. కాని ఏటా వేట విరామ సమయంలో కనిపించే లోటు ఇప్పుడు కనిపించడం లేదు. మత్స్యకారులంతా ఎన్నికల ప్రచారాలకు వెళుతుండడంతో వారికి చేతి నిండా పని దొరికింది. తమకు ఇష్టమైన నాయకుల వెంట ప్రచారాల్లో పాల్గొంటూ ఓటు వేటలో పాటు సంపాదించుకుంటున్నారు.

ఏప్రిల్ 15వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన వేట నిషేధం జూన్ 15 వరకూ కొనసాగనుంది. సాధారణంగా వేట నిషేధ సమయంలో ఇంజిన్లు లేని బోట్లతో చేపల వేట సాగించేందుకు అనుమతి ఉంటుంది. దీంతో చాలా మంది మత్స్యకారులు ఇంజన్ లేని బోట్లపై, అలివి వలలతో తీరంలో వేట సాగించి మత్స్య సంపదను తెచ్చి విక్రయిస్తుంటారు. అవే ఈ రెండు నెలల పాటు చేపల ప్రియులకు ఆహారంగా ఉపయోగపడుతుంది. అయితే గత నాలుగు రోజులుగా ఎన్నికల ప్రచారాలు ముమ్మరం చేయడంతో మండల పరిధిలోని ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట, అమీనాబాద తదితర గ్రామాల్లో నాయకుల వెంట ప్రచారం నిర్వహించడానికి రోజు కూలీ చెల్లించి మరీ మత్స్యకారులను పనికి వెళ్లకుండా ఆపుతున్నారు. దీంతో చేపలు దొరక్క చేపల ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. అందరూ ఎన్నికల ప్రచారాలకు వెళుతుండడంతో తీరప్రాంత గ్రామాల్లో ప్రచారాలు తప్ప చేపల వేట కనిపించడం లేదు. ఎన్నికల పుణ్యమా అని పడవలు, బోట్లకు లంగరు వేసేశారు. వలలన్నీ తమ ఇళ్ల వద్ద భద్రపరుచుకున్నారు. ఎక్కడికక్కడ జోరుగా ప్రచారాలు జరుగుతుండడంతో మందు విందులతో మత్స్యకార గ్రామాలు కళకళలాడుతున్నాయి. మళ్లీ 13వ తేదీ తరువాతే బోట్ల మరమ్మతులు, ఇంజిన్లు లేని బోట్లపై చేపల వేట ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

'ముత్తంగి' అలంకరణలో సత్యదేవుని దర్శనం


సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

- స్వామివారిని దర్శించిన 30 వేల మంది
- దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లు ముత్తంగి వస్త్రాలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి, అమ్మవార్లు, శివలింగాన్ని ముత్యాల కవచాలతో అలంకరిస్తున్న విషయం విదితమే. దీనిలో భాగంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేయగా వేలసంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.


కిటకిటలాడిన ఆలయం

రత్నగిరిపై సత్యదేవుని ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు రెండువేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 4 వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

ఆలయ ప్రాకారంలో గ్రీన్ షెడ్ ఏర్పాటు

సత్యదేవుని ఆలయప్రాకారంలో భక్తులకు ఎండ తగలకుండా గ్రీన్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. గతంలో గ్రీన్ షెడ్ తక్కువ ఎత్తులో ఉండేది. రథోత్సవంలో రథానికి అది తగలడంతో దానిని తొలగించి ఎత్తుగా వేశారు. దానికి తోడు కింద కార్పెట్ వేసి దానిని తడపడం ద్వారా భక్తులకు ఎండ నుంచి రక్షణ కల్పిస్తున్నారు.

దాసరి విశ్వనాథ్, సాయిజలకు సత్కారం


సాయిజ రచించిన రంగాపుర విహార నవలను ఆవిష్కరిస్తున్న కుంచె రఘు, తదితరులు

గోకవరం: అంతర్జాతీయ నవలా రచయిత, సినీ దర్శకుడు దాసరి విశ్వనాథ్ వెంకట్, అతని సోదరి సాయిజలను గోకవరంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రముఖ సినీ నటుడు, సంగీత దర్శకుడు, గాయకుడు కుంచె రఘు చేతులమీదుగా వీరిని సత్కరించారు. దాదాసాహెబ్ పాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ పురస్కారాల్లో 60 దేశాల నుంచి వచ్చిన పదివేలకు పైగా షార్ట్ ఫిల్మ్‌లు పోటీ పడగా, వీటిలో గోకవరానికి చెందిన దాసరి విశ్వనాథ్ వెంకట్ దర్శకత్వం వహించిన షార్ట్ ఫిల్మ్ ×కలయే వసంతం€ టైటిల్ విన్నర్‌గా నిలిచింది. విశ్వనాథ్ వెంకట్ ఉత్తమ షార్ట్ ఫిల్మ్ దర్శకుడిగా అవార్డు అందుకున్నాడు. విశ్వనాథ్‌తో పాటు అతని సోదరి సాయిజ దర్శకత్వం వహించిన వండర్ వుమెన్ ఆఫ్ ఏన్షియంట్ ఇండియా వెబ్‌సిరీస్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. దీంతో వారిద్దరినీ సోమవారం గోకవరంలో కుంచె రఘు సత్కరించారు. అనంతరం సాయిజ రచించిన రంగాపుర విహార నవలను విశ్వహిందూ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వనాథ్, సాయిజ తల్లిదండ్రులు దాసరి రాధాకృష్ణ, సత్య, శ్రీధర్మదర్శినీ జ్ఞానపీఠం వ్యవస్థాపకుడు, కూచిపూడి నాట్యాచారుడు దాసరి ధర్మరాజు, సినీ దర్శకుడు ఆనంద్ గుబ్బల, డాక్టర్ బద్దిరెడ్డి రామారావు, నటుడు రవి తదితరులు పాల్గొన్నారు.

'మా స్కూల్.. మా రూల్' వార్తకు స్పందన

గొల్లప్రోలు: ఈ నెల 12వ తేదీన సాక్షి పత్రికలో ప్రచురితమైన 'మా స్కూల్.. మా రూల్' వార్తకు అధికారులు స్పందించారు. గొల్లప్రోలు పట్టణంలోని మాధురీ విద్యాలయలో 8, 9వ తరగతి విద్యార్థులకు ఈ నెల 10వ తేదీన జరగవలసిన ఆంగ్ల పరీక్ష నిర్వహించకపోవడంపై డీవైఈఓ రాజు సదరు యాజమాన్యానికి 13వ తేదీన షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ నెల 20వ తేదీన పరీక్ష నిర్వహించామని, దీన్ని మొదటి తప్పుగా పరిగణించి క్షమించాలని యాజమాన్యం ఇటీవల రాతపూర్వక వివరణ ఇచ్చింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే ఎటువంటి నోటీసు లేకుండా పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారులు యాజమాన్యాన్ని హెచ్చరించారు.

కనకదుర్గమ్మ చైత్ర మాసోత్సవాలు ప్రారంభం

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి చైత్రమాస జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయంలో పండితులు కలశస్థాపన, మండపారాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. రుత్విక్కులు అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. 11 గంటలకు అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ చైత్ర మాసోత్సవాలు వచ్చే నెల 8వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు గరగల సంబరం నిర్వహిస్తారని వివరించారు.